క్లుప్తంగా

రాష్ట్ర హెల్త్ డైరెక్టర్‌కు సన్మానం



సంగెం: మండలంలోని బీకోజీనాయక్ తండాకు చెందిన రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ డాక్టర్ బానోత్ రవీంద్ర నాయక్‌ను అతడి బాల్య మిత్రులు హైదరాబాద్‌లో శుక్రవారం సన్మానించారు. తొలుత రవీంద్ర నాయక్‌కు అతడి మిత్రులు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం శాలువా కప్పి సత్కరించారు. తమ చిన్ననాటి మిత్రుడు రాష్ట్ర హెల్త్ డైరెక్టర్‌గా నియమితులు కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రవీంద్ర నాయక్‌కు సన్మానించిన వారిలో అతడి మిత్రులైన ఏసీపీ వాసం సురేందర్, కందకట్ల నరహరి, చిట్టిమల్ల రమేష్‌బాబు, తదితరులున్నారు.

ఉచిత వైద్యశిబిరం



గీసుకొండ: మండలంలోని చంద్రయ్యపల్లిలో రిలీఫ్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్వాహకులు శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పలువురికి బీపీ, షుగర్, గుండె సంబంధిత పరీక్షలు ఉచితంగా నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆకుల స్రవంతి, రుద్ర ప్రసాద్, ఆస్పత్రి వైద్యులు డాక్టర్ సునీత్, సిబ్బంది గోపీ, వేణు, స్పందన, విజన్, సంపత్, కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

పెరిక సంఘం కార్యవర్గం ఎన్నిక



దేవేందర్



మహేందర్

చెన్నారావుపేట: మండలంలోని ఖాదర్‌పేటకు చెందిన పెరిక సంఘం కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉప్పుల దేవేందర్, ఉపాధ్యక్షుడుగా లక్కర్స్ సాంబయ్య, ప్రధాన కార్యదర్శిగా చింత మహేందర్, కోశాధికారిగా శిరంశెట్టి రమేశ్, సభ్యులుగా శిరంశెట్టి వెంకటేశ్, చింతం రాజేందర్, ప్రశాంత్, రాజేశ్ ఎన్నికయ్యారు.

బాధిత కుటుంబాలకు బియ్యం సాయం



చెన్నారావుపేట: మండలంలోని పాత ముగ్దుంపురం గ్రామానికి చెందిన సుంకరి రమేశ్, షేక్ మదార్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు శుక్రవారం బియ్యం సాయం చేశారు. తొలుత మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ననుమాస వీరస్వామి, సీనియర్ నాయకులు బండారి సత్యం, పోలెపల్లి భిక్షపతి, మాజీ ఉపసర్పంచ్ ననుమాస కరుణాకర్, నాయకులు అల్వాల శ్రీనివాస్, శంకేసి రంజిత్, మాదాసి రాజేందర్, హైదర్, షేక్ వలీ, యాకూబ్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో వార్డు సభ్యుడి మృతి



సమ్మయ్య (ఫైల్)

నల్లబెల్లి: మండలంలోని కొండాపూర్ గ్రామ రెండో వార్డు సభ్యుడు కల్తీ సమ్మయ్య (55) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందాడు. సమ్మయ్య కొంత కాలంగా కాలేయ సంబంధిత, షుగర్ వ్యాధులతో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం ఉదయం కడుపు నొప్పి తీవ్రం కావడంతో కుటుంబ సభ్యులు నర్సంపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పరిస్థితి విషమించి సమ్మయ్య మృతి చెందాడు. మృతుడికి భార్య సమ్మక్క, ఇద్దరు కొడుకులున్నారు. సర్పంచ్ గూబ తిరుపతమ్మ మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. సమ్మయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు.

పరామర్శ



పర్వతగిరి: మండల కేంద్రానికి చెందిన చింతపట్ల పాపారావు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి శుక్రవారం పరామర్శించారు. పాపారావు మృతి పట్ల సంతాపం తెలిపారు.

పంట కాల్వలోకి డ్రెయినేజీ నీరు..

● రైతులు, వ్యవసాయ కూలీలకు తిప్పలు



మాదన్నపేట పెద్దకాల్వలోకి చేరుతున్న మురుగు నీరు

నర్సంపేట రూరల్ : వ్యవసాయ భూములకు నీరందించే మాదన్నపేట పెద్దకాల్వలో డ్రెయినేజీ నుంచి వస్తున్న మురుగు నీరు కలుస్తుండడంతో పంటలు దెబ్బతింటున్నాయి. చర్మ రోగాలొస్తున్నాయంటూ పనులకు రావడానికి వ్యవసాయ కూలీలు జంకుతున్నారు. ఐబీ, మున్సిపల్ శాఖల అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్న అపవాదు ఉంది. నర్సంపేట మండలంలో మాధన్నపేట చెరువు కింద సుమారు 3 వేల ఎకరాల ఆయకట్టు ఉంటుంది. అనధికారికంగా మరో 500 ఎకరాలు సాగవుతోంది. మాదన్నపేట చెరువుకు మూడు ప్రధాన కాల్వ లున్నాయి. దుబ్బకాల్వ నుంచి నాగుర్లపల్లి గ్రామ శివారులోని వ్యవసాయ భూములో సాగునీరు పారుతోంది. మిట్టకాల్వ నీటితో కమలాపురం గ్రామ శివారులోని పంట పొలాలకు పారకం సాగుతోంది. మాదన్నపేట పెద్ద కాల్వ దాదాపు 5–6 కిలోమీటర్ల మేర పారకం ఉంది. ఈ పారకంలో నర్సంపేట నుంచి సుమారు 2 కిలోమీటర్ల మేరకు కాల్వ నీరు పారడం పరిపాటి. గతంలో ఈ కాల్వ కింద వ్యవసాయ భూములు ఉండగా పట్టణ అభివృద్ధి నేపథ్యంలో మొత్తం ఇళ్లు కావడంతో కాల్వ మధ్యలో ఆగింది. దాదాపు 2 కిలోమీటర్ల ఇళ్ల మధ్యలో నుంచి సాగునీరు పారుతుండడంతో ఆ వైపున్న డ్రైనేజీ మురుగు నీరు కాల్వలో చేరుతుండడంతో నీరంతా కలుషితమవుతోంది. అంగడి సెంటర్‌లో మాదన్నపేట పెద్ద కాల్వ పక్కనే కమేలా ఉండడంతో జంతువులను వధించిన తర్వాత వచ్చిన వ్యర్థాలు సైతం నీటిలోనే కలుస్తున్నాయి. గతంలో ఈ కాల్వ వద్దకు రైతులు పశువులను తీసుకొచ్చి నీళ్లు తాగించే పరిస్థితి ఉండేది. కాగా ప్రస్తుతం ఆ నీటిని కనీసం పశువులు కూడా తాగలేని స్థితి నెలకొంది. సదరు మురుగు నీళ్లు వ్యవసాయ భూములకు పారడంతో పంటల దిగుబడి తగ్గిపోతోంది. రైతులు నీళ్లు పారించాలన్నా ఇబ్బంది పడాల్సి వస్తోంది. వ్యవసాయ కూలీలు సదరు పంట భూముల్లో పని చేయాలంటే ఇబ్బంది పడాల్సి వస్తోంది. దురద, ఇతర చర్మ సంబంధిత రోగాల బారిన పడుతున్న పరిస్థితి ఉంటోంది. డ్రైనేజీ నుంచి వస్తున్న మురుగు సాగునీటిలో కలువకుండా చూడాలని కోరుతూ నర్సంపేట ఐబీ, మున్సిపల్ అధికారులకు పలుమార్లు వినతులు సమర్పించినప్పటికి పట్టించుకున్న దాఖలాల్లేవు. ఇకనైనా ప్రభుత్వం, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించాలని రైతులు, వ్యవసాయ కూలీలు కోరుతున్నారు.



పెద్ద కాల్వలోని సాగునీటిలో కలిసిన మురుగు

పర్వతగిరి : పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు



‘లీడ్’ సేవలు అభినందనీయం



నర్సంపేట : క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే



పర్వతగిరి: క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సభ్యులు

● ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట: విద్యారంగంలో నర్సంపేట ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపించే దిశగా లీడ్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఆ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్‌ను తన క్యాంప్ కార్యాలయంలో ఆయన శుక్రవారం ఆవిష్కరించి మాట్లాడారు. నర్సంపేట అభివృద్ధికి ప్రతీఒక్కరు శ్రమించాలని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు తక్కళ్లపల్లి రవీందర్‌రావు, వేముల సాంబయ్యగౌడ్, రాజేందర్, నగేశ్, మధు పాల్గొన్నారు.

శ్రీరామ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

పర్వతగిరి: మండలంలోని చింతనెక్కొండ గ్రామంలో శ్రీరామ సంఘం 19వ వార్షికోత్సవ నూతన సంవత్సర క్యాలెండర్‌ను అధ్యక్షుడు కుడికాల శ్రీధర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపకుడు అక్కినపల్లి సతీశ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు దర్నోజు దేవేందర్, ఉపాధ్యక్షుడు సుధీర్, కోశాధికారి నమిండ్ల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి కుడికాల మోహన్, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్..

పర్వతగిరి: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో మండల శాఖ ఆధ్వర్యంలో పీఆర్‌టీయూ టీఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఎంపీడీఓ సంతోశ్ కుమార్, ఎంఈఓ సత్యనారాయణ, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు భిక్షపతి, బి.రమేశ్ ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షుడు భూక్య రాములు, ప్రధాన కార్యదర్శి వుగ్గె రమేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గఫార్, తదితరులు పాల్గొన్నారు.

‘కట్ర్యాల’ జాతరకు ఏర్పాట్లు షురూ



రహదారి పనులను పర్యవేక్షిస్తున్న చైర్మన్

వర్ధన్నపేట: మండలంలోని కట్ర్యాల గ్రామంలోని మల్లికార్జునస్వామి ఆలయంలో ఈనెల 14 నుంచి 16 వరకు జాతర ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు మొదలయ్యాయి. ఆలయ నూతన ఉత్సవ కమిటీని శుక్రవారం ప్రకటించారు. ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించడానికి కమిటీ పని చేస్తుందని ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు పేర్కొన్నారు. ఆలయానికి వెళ్లే దారిని జేసీబీతో శుక్రవారం చదును చేయించారు. నూతన ఉత్సవ కమిటీ చైర్మన్‌గా కట్ట వెంకటయ్య, గౌరవ అధ్యక్షుడిగా గుజ్జ రవీందర్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా గజ్జెల సంజీవ, బండారి కుమారస్వామి, కోశాధికారిగా నాంపెల్లి రవీందర్, జనరల్ సెక్రటరీగా శ్రీపాది కృష్ణ, సహాయ కార్యదర్శులుగా బండారి మల్లయ్య, తాటికాయల కుమారస్వామి, డైరెక్టర్లుగా మునిగాల మల్లేశ్, యాకూబ్ అలీ, చెవ్వల్ల సమ్మయ్య, ఇటికాల రవి, నాంపెల్లి లక్ష్మణ్, సుల్తాన్, మధు, సంతోశ్, తాటికొండ వీరేశం, రాసురి శంకర్, చెవ్వల్ల దేవేందర్, ముత్యాల దీపక్, ఇబ్రహీం, చిక్కొండ ఎల్లయ్య, ఎలికట్టె రాజు, చెవ్వల రాజు, జంపాల మల్లేశ్, చెంగల సమ్మయ్య, చెవ్వల్ల రమేశ్ ఉన్నారు. రహదారి చదును పనులను కమిటీ పర్యవేక్షించింది. పలు అభివృద్ధి కార్యక్రమాలపై కమిటీ చర్చించింది. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు కల్పించనున్నట్టు కమిటీ పేర్కొంది. కార్యక్రమంలో నాయకులు బండారి సతీశ్ గౌడ్, నరుకుడు వెంకటయ్య, గజ్జెల సారయ్య, అక్బర్, తీగల సునీత, గజ్జెల రాజు, కరీం పాషా, జంపాల సత్తయ్య, చెవ్వల్ల బొంద్యాలు, భిక్షపతి, పూజారులు శ్రీశైలం, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కకు అభినందన



మంత్రి సీతక్కతో నాయకులు

గీసుకొండ: మండలానికి చెందిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు నాయిని భరత్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి ఆరకట్ల సాయి, మాజీ సర్పంచ్ జన్ను రమేశ్, సోషల్ మీడియా ప్రతినిధి పాషా, జన్ను నరేశ్ రాష్ట్ర మంత్రి సీతక్కను ములుగులోని క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. మండల అభివృద్ధికి చొరవ చూపాలని మంత్రిని కోరారు.

అర్హులందరికీ ‘అభయహస్తం’ ఖాయం



నర్సంపేట: దరఖాస్తు స్వీకరిస్తున్న సాంబయ్య



నెక్కొండ: దరఖాస్తు స్వీకరిస్తున్న ఉషాదయాళ్



ఖానాపురంలో..



చెన్నారావుపేట : మాట్లాడుతున్న పత్తినాయక్



గీసుకొండ : పరిశీలిస్తున్న ఎంపీడీఓ వీరేశం

● మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ వేముల సాంబయ్య

నర్సంపేట: రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ అభయ హస్తం పథకాన్ని అమలు చేయడం ఖాయమని మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ వేముల సాంబయ్యగౌడ్ తెలిపారు. పట్టణంలోని 20, 21వ డివిజన్లలో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటస్వామి, ఇతర అధికారులతో కలిసి ఫ్లోర్‌లీడర్ సాంబయ్య ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభయహస్తం పథకాన్ని పేదలు వినియోగించుకోవాలని కోరారు. పథకాల అమలులో అక్రమాలకు తావులేదని స్పష్టం చేశారు. ప్రజలు ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదన్నారు. నాలుగు నెలలకోసారి ప్రజాపాలన కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ రత్నమాల, ఏఓ టి.కృష్ణకుమార్, మాజీ వార్డు మెంబర్ గాజుల రమేశ్, కాంగ్రెస్ నాయకుడు దండెం రతన్ కుమార్, పట్టణ ఉపాధ్యక్షుడు వేముల సారంగం గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ: మండలంలోని పత్తిపాక, దీక్షకుంట, సూరిపల్లి గ్రామాల్లో నిర్వహించిన సభల్లో మండల ప్రత్యేక అధికారి ఉషా దయాళ్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. అర్హులు అభయ హస్తం ఆరు గ్యారంటీల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ లావుడ్యా సరిత, ఏఓ నాగరాజు, ఏపీఎం శ్రీనివాస్, జీపీ కార్యదర్శి ఒంటేరు రాకేశ్, ఉపసర్పంచ్ బోడ సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం: మండలంలో గ్రామసభలు శుక్రవారం కొనసాగాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీఓ సుమనవాణి ప్రజాపాలన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఇప్పటివరకు 10 వేల 121 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు.

చెన్నారావుపేట: మండలంలోని గొల్లభామతండా, పత్తినాయక్‌తండా, సూర్యపేటతండా, జోజిపేట నారాయణతండాల్లో గ్రామ సభలు కొనసాగాయి. ఈ సందర్భంగా జెడ్పీటీసీ బానోత్ పత్తినాయక్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అభయాస్తం పేరుతో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు అర్హులైన ప్రతీఒక్కరు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ బాలకృష్ణ, తహసీల్దార్ ఫణికుమార్, ఎంపీడీఓ భారతి, ఎంపీఓ శ్రీధర్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల కంప్యూటరీకరణ ప్రారంభం

గీసుకొండ: ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల కంప్యూటరీకరణను మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎస్.వీరేశం శుక్రవారం ప్రారంభించారు. ఇప్పటివరకు మండల పరిధిలో 8,580 దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలిపారు. సేకరించిన దరఖాస్తులను ఈనెల 17లోపు ఆన్‌లైన్ చేసే ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులు ఆదేశించినట్లు చెప్పారు. తప్పులు లేకుండా దరఖాస్తుల్లోని వివరాలను నమోదు చేయాలని డాటా ఎంట్రీ ఆపరేటర్లకు స్పష్టం చేశారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతల పంపిణీ



నర్సంపేట: అక్షింతలను తీసుకెళ్తున్న సభ్యులు



చెన్నారావుపేట : అక్షింతలతో సర్పంచ్ రమేశ్



దుగ్గొండి: గిర్నిబావిలో..



గీసుకొండ : ధర్మారంలో..

నర్సంపేట: అయోధ్యలోని రామ మందిరంలో పూజించబడిన అక్షింతలను వితరణ సమితి సభ్యులు పట్టణంలో ఇంటింటికీ శుక్రవారం పంపిణీ చేశారు. తొలుత స్థానిక రామాలయంలో అక్షింతలకు పూజారి నాగరాజు ప్రత్యేక పూజలు నిర్వహించి పూర్ణ కుంభంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అక్షింతల వితరణ రామాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ నుంచి మల్లంపల్లి రోడ్డు వరకు ఇంటింటికీ వెళ్లి అక్షింతలు అందజేశారు.

పర్వతగిరి: మండల కమిటీ అధ్యక్షుడు చింతకుంట్ల మల్లికార్జున్ ఆధ్వర్యంలో మండలంలోని శ్రీనగర్ గ్రామానికి అయోధ్య రాముడి అక్షింతలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రంగు కుమార్, శనిగరం రంజిత్, హర్షం ఆనంద్ పాల్గొన్నారు.

చెన్నారావుపేట: రామమందిరం ట్రస్ట్ నుంచి అందిన అక్షింతలను మండలంలోని లింగాపురం, చిన్న గురిజాల గ్రామాల్లో సర్పంచ్ తప్పెట రమేశ్ ఆధ్వర్యంలో ఇంటింటికీ పంపిణీ చేశారు. తొలుత గ్రామంలో శ్రీరాముని చిత్రపటాలతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో గో సేవక్ జిల్లా ప్రముఖ్ విభూది శివకుమార్, ఎంపీటీసీ పసునూటి రమేశ్, ఉపసర్పంచ్‌లు వేములపల్లి రాజ్‌కుమార్, రాగిడి కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండి: మండలంలోని గిర్నిబావిలో భజన మండలి ఆధ్వర్యంలో అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈనెల 22న అయోధ్యలో జరిగే పూజల సందర్భంగా అక్షింతలను పూజించాలని చెప్పారు. కార్యక్రమంలో మండలి బాధ్యులు, దేవాదాయ కమిటీ బాధ్యులు, శ్రీరాముని భక్తులు పాల్గొన్నారు.

గీసుకొండ: ధర్మారంలో అయోధ్యలోని రామమందిరంలో పూజించిన అక్షింతలు, కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గట్టికొప్పుల రాంబాబు, నాయకులు ఆరె కుమార్, గోదాసి లింగమూర్తి, బీఆర్ఎస్ నాయకులు సంకతాల రాజు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతిలో హెచ్ఎంలు కీలకం



మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్ సరళ

చెన్నారావుపేట: విద్యార్థులు ఉన్నతి సాధించడంలో ప్రధానోపాధ్యాయులు (హెచ్‌ఎం)లు కీలకమని జల్లి స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం, మండల నోడల్ ఆఫీసర్ సరళ తెలిపారు. మండలంలోని జల్లి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన పీఎస్ లెవల్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పాఠశాలల తనిఖీల్లో పరిశీలించిన విషయాలపై ఉపాధ్యాయులతో చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడారు. విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యేలా హెచ్‌ఎంలు చూడాలని చెప్పారు. ఎఫ్ఆర్ఎస్ యాప్ ప్లస్, బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజన మెనూ, విద్యార్థుల హాజరు శాతం పెంపు, ఫార్మెటివ్ సమ్మేటివ్ మార్కులు, ఎఫ్ఎల్ఎన్ ట్రాకర్‌ను ఆన్‌లైన్‌లో ఎంట్రీ, తదితరాలపై సూచనలు చేశారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించేలా చూడాలని చెప్పారు. సమావేశంలో కాంప్లెక్స్ కార్యదర్శి ఈర్య, మహేందర్, కొంరయ్య, ఇంద్రయ్య, ఉమాశంకర్, హెలెన్ దేవకుమారి, గౌతమి, విజయకుమారి, సీఆర్పీ కందిక శిల్ప పాల్గొన్నారు.

నడి రోడ్డుపై భారీ గుంత

● పూడ్చివేయడంలో అధికారుల నిర్లక్ష్యం



లింగగిరి శివారులో రోడ్డుపై ఏర్పడిన గుంత

చెన్నారావుపేట: నెక్కొండ నుంచి గూడూరు వెళ్లే రహదారిలో లింగగిరి గ్రామ శివారులోని మూలమలుపులో నడి రోడ్డు మధ్యలో సుమారు 5 ఫీట్ల లోతున్న గుంత ఏర్పడింది. గుంత ప్రమాదకరంగా ఉన్న క్రమంలో దాన్ని పూడ్చడంలో ఆర్ అండ్ బీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ దారి వెంట ప్రతీరోజు వందలాదిగా వాహనాలు రాకపోకలు సాగించడం పరిపాటి. పట్టపగలు సైతం ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. ఇక రాత్రి వేళల్లో ఎవరైనా ఆ రోడ్డు వెంట ద్విచక్ర వాహనంపై వెళ్తే సుమారు 5 ఫీట్ల లోతున్న సదరు గుంతలో పడితే ప్రాణాలకు ప్రమాదం తప్పదంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి గుంతను తక్షణమే పూడ్చివేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దు

ఆత్మకూరు : మండలంలోని అక్కంపేటను రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేసే అంశంలో పెద్దాపూర్ గ్రామ ప్రజలకు ఇబ్బందులు కలిగించొద్దని గ్రామస్తులు కోరారు. అక్కంపేట గ్రామం పెద్దాపూర్ రెవెన్యూ పరిధిలో ఉండగా గ్రామస్తుల అభిప్రాయం మేరకు ప్రభుత్వం అక్కంపేటను రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేసేందుకు ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆర్డీఓ శ్రీనివాస్ పెద్దాపూర్‌లో శుక్రవారం అభ్యంతరాల స్వీకరణ గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో గ్రామస్తులు పలు అభ్యంతరాలను అధికారులకు దృష్టికి తీసుకొచ్చారు. పెద్దాపూర్ చెరువును పెద్దాపూర్‌లోనే ఉంచాలని, సర్వే నంబర్ల తరలింపులో గ్రామానికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఆర్డీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎవరికి ఇబ్బంది కలుగకుండా అక్కంపేటను రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో తహసీల్దార్ సురేశ్‌కుమార్, జెడ్పీటీసీ కక్కెర్ల రాధిక రాజు, సర్పంచ్ సావురే కమల రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఏజెన్సీ గ్రామాల్లో దుప్పట్ల పంపిణీ

గూడూరు: మండలంలోని ఏజెన్సీ గ్రామాలైన దొరవారి తిమ్మాపురం, ఊట్ల, మచ్చర్ల, కొంగరగిద్ద గ్రామాల ప్రజలకు రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ పి.వరప్రసాద్ శుక్రవారం దుప్పట్లు, దోమతెరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వృద్ధులు చలి, దోమల బారిన పడకుండా కుటుంబ సభ్యులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చలికాలం నేపథ్యంలో దోమతెరలు, దుప్పట్లు వినియోగించుకుని రోగాల బారి నుంచి కాపాడుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ ప్రతినిధులు నెహ్రూ, వెంకన్న, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ వీరన్న నాయక్, ఎంపీడీఓ రోజారాణి, తహసీల్దార్ అశోక్ కుమార్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

నర్సంపేట రూరల్ : ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై శీలం రవి తెలిపారు. శాంతినగర్‌కు చెందిన ప్రసాద్, రాపోలు చింటూ గురువారం రాత్రి మద్యం మత్తులో పట్టణంలోని కోర్టు సమీపంలో గొడవపడ్డారు. ఇద్దరికీ గాయాలు కాగా శుక్రవారం పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు మరమ్మతు పనులు



వర్ధన్నపేట: రోడ్డు ప్రమాదాల నివారణ కోసం సీఐ శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు, పెట్రో కార్ సిబ్బంది సహాయంతో రెడిమిక్స్‌తో వర్ధన్నపేట నుంచి ఉప్పరపల్లి క్రాస్ రోడ్డు వరకు జాతీయ రహదారిపై శుక్రవారం రోడ్డు మరమ్మతులు చేపట్టారు. గుంతలను పూడ్చివేశారు. ప్రమాదాల నివారణ కోసం పోలీసులు చొరవ తీసుకోవడంపై సర్వత్రా హర్షం వ్యక్తమౌతోంది.